క్లుప్తంగా

విద్యార్థులు ఆదర్శంగా మెలగాలి



ఆకట్టుకున్న విద్యార్థుల నృత్య ప్రదర్శన

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు శ్రీహరిపురం జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. వార్డు కార్పొరేటర్ గులిగిందల లావణ్య మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు శ్రద్ధగా పరీక్షలు రాసి మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. ఉన్నత చదువుల కోసం ఎంత దూరం వెళ్లినా పాఠశాలను మరవ వద్దని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులుపాల్గొన్నారు.

బోరుబావులకు మరమ్మతులు



మరమ్మతు పనులు చేయిస్తున్న వార్డు అధ్యక్షుడు గులిగిందల కృష్ణ

మల్కాపురం: ఎండలు మండుతుండడంతో జీవీఎంసీ 58వ వార్డులోని పలు ప్రాంతాల్లో మంచినీటి పథకాల నిర్వహణ పనులు చేపట్టారు. కార్పొరేటర్ గులిగిందల లావణ్య సూచనలతో మేరకు సిబ్బంది బుధవారం మరమ్మతు పనులు చేపట్టారు. పనులను వార్డు పార్టీ అధ్యక్షుడు కృష్ణ దగ్గరుండి చేయించారు. ఆయన మాట్లాడుతూ వేసవి సందర్భంగా భూగర్భంలో నీటి జలాలు అడుగంటే అవకాశాలు ఉండటంతో మరింత లోతు తవ్వించడంతో పాటు కొన్ని చోట్ల బోరుబావులకు మరమ్మతులు చేపట్టామన్నారు. కార్యక్రమంలో మంచినీటి సరఫరా విభాగ సిబ్బంది పాల్గొన్నారు.

జ్వరాల విజృంభణ



గుల్లలపాలెం వద్ద గల ఎఫ్ఆర్‌యూలో జ్వర పీడితులు

మల్కాపురం: వాతావరణంలో మార్పుల వల్ల పారిశ్రామిక ప్రాంతంలో జ్వరాలు విజృంభిస్తున్నాయి. జ్వరం,జలుబు, దగ్గు సమస్యతో పట్టణ ఆరోగ్య కేంద్రాలకు రెండు రోజుల నుంచి రోగులు క్యూ కడుతున్నారు. 60వ వార్డులోని గుల్లలపాలెం వద్ద గల ఎఫ్ఆర్‌యూకు రెండు రోజుల నుంచి జ్వరం, దగ్గు, జలుబుతో పాటు శరీరం నీరసించిన సమస్యతో బాధపడుతున్న వారు ఎక్కువగా వస్తున్నారు. ప్రైవేట్ ఆస్పత్రులకు మరి కొంత మంది వెళ తున్నారు.

ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

మల్కాపురం: టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని జీవీఎంసీ 58, 61వ వార్డుల్లో ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు కోరాడ శ్రీను, మజ్జి సోమేష్,చింతలపూడి సత్యనారాయణ,కాకి పోలిరెడ్డి, సర్వసుద్ధి శ్రీలక్ష్మి, ఎమ్మెల్యే గణబాబు కుమారుడు మౌర్య తదితరులు పాల్గొన్నారు.

సింధియా: జీవీఎంసీ 63వ వార్డు క్రాంతినగర్, చింతల్లోవ, కాకరలోవ తదితర ప్రాంతాల్లో టీడీపీ 41వ ఆవిర్భావ దినోత్సవాన్ని టీడీపీ విశాఖ పార్లమెంట్ జిల్లా ఉపాధ్యక్షురాలు తోట రత్నం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పేదల మహిళలకు చీరలు పంపిణీ చేశారు.

'హామీలు నెరవేర్చాలి'

ఉక్కునగరం: కార్మికుల సమస్యల పరిష్కారం కోసం యాజమాన్యం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్ఎంయూ) స్టీల్ సిటీ డిపో అధ్యక్షుడు జి.ఎస్.ఆర్.కృష్ణ డిమాండ్ చేశారు. ఎన్ఎంయూ రీజనల్ కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం జరిగిన గేటు మీటింగ్‌లో ఆయన ప్రసంగించారు. సీనియార్టీ ప్రకారం డ్యూటీ చార్టులు వేయాలని, డిపో మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్ల ఏకపక్ష వైఖరి నశించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జి. ఈశ్వరరావు, ఎ.వి.రమణ, ఎస్.వై. నిర్మల, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా హాకర్స్ జోన్



హాకర్స్ జోన్ వద్ద విశ్రమిస్తున్న గుర్తుతెలియని వ్యక్తి



గుల్లలపాలెం వుడా కాలనీ హాకర్స్ జోన్‌లో అనధికారంగా ఏర్పాటు చేసిన పారిశుధ్య కార్మికుల కార్యాలయం

- కొన్ని షాపుల్లో అనధికారికంగా వ్యాపారాలు
- ఆకతాయిలు, యాచకులకు అడ్డాగా మారిన వైనం

మల్కాపురం: చిరువ్యాపారుల కోసం లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన హాకర్స్ జోన్ చివరికి నిరుపయోగంగా మిగిలింది. వ్యాపారాలు సాగించాల్సిన చోట.. ఆకతాయిలు మద్యం తాగడానికి, యాచకులు సేద తీరడానికి అడ్డాగా మారింది. జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం వుడా కాలనీలో సుమారు రూ.17 లక్షలతో 2014లో హాకర్స్ జోన్‌ను ఏర్పాటు చేశారు. మల్కాపురం నుంచి జింక్ ప్రాంతం వరకు పలువురు ఫుట్‌పాత్ వ్యాపారుల కోసం హాకర్స్ జోన్ నిర్మించారు. దానిలోకి తాము రాలేమని, అక్కడ తమ వ్యాపారాలు సాగవని, రోడ్డుపై అయితే గిట్టుబాటు ఉంటుందని ఫుట్‌పాత్ వ్యాపారులు నిరాకరించారు. దీంతో అప్పటి నుంచి ఈ హాకర్స్ జోన్ ఖాళీ గానే ఉండిపోయింది. ఆపై పలువురు స్థానిక వ్యాపారులు ఎటువంటి అద్దె చెల్లించకుండా.. జీవీఎంసీ అధికారుల అనుమతులు లేకుండా జోన్‌లోని కొన్ని షాపుల్లో వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. మరి కొన్ని షాపులు ఆకతాయిలకు మద్యం తాగడానికి, యాచకులు విశ్రమించడానికి ఉపయోగపడుతున్నాయి. లక్షల రూపాయలతో నిర్మించిన హాకర్స్ జోన్ ఇలా నిరుపయోగంగా మారడంతో స్థానికులు అధికారుల వద్ద మొర పెట్టుకున్న నేటికీ స్పందన లేదు. సంబంధిత అధికారులు పరిశీలించి హాకర్స్ జోన్‌ను ప్రజా ప్రయోజనార్థం వినియోగించేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

గుల్లలపాలెం వుడా కాలనీలోని హాకర్స్ జోన్ సమస్య నా దృష్టిలో లేదు. దీనిపై అధికారులను ఆదేశించి, అక్కడ పరిస్థితిని తెలుసుకుని అవసరమైన చర్యలు తీసుకుంటాం. సమస్య పరిష్కారానికి కృషి చేస్తా.

– ఆర్.జి.వి.కృష్ణ, జోన్–5 కమిషనర్, జీవీఎంసీ

కాలువలు అధ్వానం

- పట్టించుకోని శానిటరీ అధికారులు



వెంకటాపురం నుంచి పద్మనాభనగర్ వెళ్లే దారిలో పిచ్చిమొక్కలతో నిండి ఉన్న గెడ్డ



జనతాకాలనీ వద్ద పూడికలతో అధ్వానంగా ఉన్న కాలువ

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు వెంకటాపురం, జనతా కాలనీ, పద్మనాభనగర్, ఎస్సీబీసీ కాలనీ ప్రాంతాల్లో కాల్వలు, గెడ్డలు అధ్వానంగా తయారయ్యాయి. వీటి గురించి పట్టించుకున్న నాథుడే కరువయ్యారని స్థానికులు వాపోతున్నారు. వెంకటాపురం నుంచి పద్మనాభనగర్ వెళ్లే దారిలో ఉన్న గెడ్డ పిచ్చి మొక్కలు, పూడికలతో నిండిపోయి ఉంది. జోన్ స్థాయి అధికారులు ప్రధాన రహదారులపై మాత్రమే దృష్టి పెడుతున్నారే తప్ప శివారు ప్రాంతాల్ని పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. వీధుల్లో కాల్వలు కంటి తుడుపు చర్యలుగా నెలకోసారి తుడుస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దోమలు, దుర్వాసనతో అవస్థలు పడుతున్నామని వాపోతున్నారు. అధికారులు స్పందించి కాలువలు శుభ్రం చేయడంతో పాటు దోమల మందు పిచికారీ చేయాలని కోరుతున్నారు.

యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి



ప్రసంగిస్తున్న డిప్యూటీ కలెక్టర్ జె.మాధవి

ఏయూ క్యాంపస్: యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని డిప్యూటీ కలెక్టర్ జె.మాధవి అన్నారు. బుధవారం ఏయూ ఫార్మసీ కళాశాల సమావేశ మందిరంలో డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ దిశగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. యువతరం ఆరోగ్య జీవనం అలవరచుకోవాలని సూచించారు.

ఏయూ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్ మాట్లాడుతూ 'సే నో టు డ్రగ్స్'అనే నినాదంతో ముందుకు సాగాలన్నారు. యువత పెడతోవ పట్టకుండా వారిలో మంచి ఆలోచనలు పెంచడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం ప్రత్యేకంగా టోల్ ఫ్రీ నంబర్ 14500 ఏర్పాటు చేసి యువతను మత్తు పదార్థాలకు దూరంగా ఉంచే ప్రయత్నం చేస్తోందన్నారు. ఏయూ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వై.రాజేంద్ర ప్రసాద్, గ్రీన్ వ్యాలీ ఫౌండేషన్ చైర్మన్ ఉమారాజ్, ప్రభుత్వ మానసిక వైద్యశాల వైద్యులు డాక్టర్ కె.ప్రభాత్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎస్ఐ ఎల్.మాధవి, ఎక్సైజ్ విభాగం ఎస్ఐ జి.రాజేశ్వరి, ఫార్మసీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ పి.శైలజ పాల్గొన్నారు.

వృక్షశాస్త్ర విభాగం సందర్శన



విద్యార్థులతో మాట్లాడుతున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం వృక్షశాస్త్ర విభాగాన్ని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా విభాగంలో ఉన్న వివిధ మొక్కల వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు స్వయంగా అభివృద్ధి చేస్తున్న పలు మొక్కలతో కూడిన నర్సరీని పరిశీలించారు. విద్యార్థులను అడిగి మొక్కల వివరాలు, ప్రత్యేకతలు, వాటిని పెంచే విధానం తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విద్యార్థులకు ప్రత్యక్ష జ్ఞానాన్ని అందించే విధంగా కృషి చేయాలని సూచించారు. వర్సిటీలో నూతనంగా నిర్మించే పలు భవనాల వద్ద సుందీకరణ, మొక్కలు నాటే కార్యక్రమంలో విలువైన సూచనలు వృక్షశాస్త్ర విభాగం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య పి.రత్నకుమార్, బ్యూటిఫికేషన్ విభాగం డీన్ డాక్టర్ ఉజ్వల్ కుమార్ ఘటక్, విభాగ ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సుకన్య సమృద్ధి యోజనపై విస్తృత అవగాహన

ఎంవీపీ కాలనీ: ఆడపిల్లల భవిష్యత్ ఆర్థిక భరోసా కోసం కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన సుకన్య సమృద్ధి యోజన పథకంపై రీజనల్ పోస్టల్ కార్యాలయం ఆధ్వర్యంలో విస్తృత అవగాహన కల్పించారు. బుధవారం లాసన్స్‌బే కాలనీ పోస్ట్ ఆఫీసులో జరిగిన ఈ కార్యక్రమంలో పోస్టల్ శాఖ విశాఖ రీజియన్ అసిస్టెంట్ డైరెక్టర్ డబ్ల్యూ.నాగ అదిత్యకుమార్ మాట్లాడుతూ సుకన్య సమృద్ధి యోజన పథకం ద్వారా ప్రతి ఇంటి ఆడపిల్లకు మంచి జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం అత్యధిక వడ్డీ రేటును అందిస్తుందన్నారు. ఆడ పిల్ల 18 ఏళ్లు నిండే వరకు డబ్బులు జమ చేస్తే తనకు ఆర్థిక భరోసా లభిస్తుందన్నారు. అనంతరం పలువురు ఖాతాదారులకు పథకం వివరాలతో కూడిన కరపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ శాఖ ప్రతినిధులు ఉమామహేశ్వరరావు, కె.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఎం విభాగాధిపతికి అభినందనలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ అధిక ఉత్పత్తి సాధించే దిశగా ఉద్యోగులందరూ శ్రమించాలని స్టీల్‌ప్లాంట్ సెంట్రల్ మెయింటెనెన్స్ మెకానికల్ (సీఎంఎం) జనరల్ మేనేజర్ గణేష్‌కుమార్ కోరారు. సీఎంఎం నూతన విభాగాధిపతిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా బుధవారం స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకులు ఆయనను కలిసి శాలువా కప్పి, బొకేతో అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో స్టీల్‌ప్లాంట్ భవిష్యత్తుకు అధిక ఉత్పత్తి సాధించడం అవశ్యమన్నారు. అంతకు ముందు ఐఎన్‌టీయూసీ నాయకులు విభాగం కార్మికుల సమస్యలను ఆయనకు వివరించారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ కార్యదర్శి పి.ఎస్.వి.ఎన్. గోపాల్, నాయకులు వాసు, బి. స్వామినాథం, వి.వి.శెట్టి తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం



అప్పన్న ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ ఆస్థాన మండపంలో ఉదయం 9.30 నుంచి ఈ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

సుబ్బారెడ్డి దృష్టికి పలు అంశాలు



వైవీ సుబ్బారెడ్డికి పుష్పగుచ్ఛమందిస్తున్న బీఎస్ కృష్ణ

గోపాలపట్నం: టీటీడీ చైర్మన్, వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డిని విశాఖ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ కృష్ణ బుధవా రం సర్క్యూట్ హౌస్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన నగరంలో కొత్త రైతు బజార్ల ఆవశ్యకత, ఉన్న బజారుల అభివృద్ధి అంశాలను సుబ్బారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.

నేడూ విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

మర్రిపాలెం: ఈ నెల 30వ తేదీ గురువారం కూడా ఏపీఈపీడీసీఎల్ జోన్–2 పరిధిలో విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు కౌంటర్లు తెరిచే ఉంటాయని ఈఈ బి.కె.నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని సెలవు లేదని, ఎస్ఎస్‌టీఎల్ సెక్షన్ మాధవధార వుడా కాలనీ, కంచరపాలెంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆర్‌ఐవీ కలెక్షన్ సెంటర్లు అందుబాటులో ఉంటాయని చెప్పారు. వినియోగదారులు గమనించి బిల్లులు చెల్లించుకోవచ్చని ఆయన పేర్కొన్నారు.

నేడు ప్రత్యేక పూజలు



ప్రశాంతినగర్‌లో వెలసిన సాయిబాబా

గోపాలపట్నం: గోపాలపట్నం ప్రశాంతినగర్‌లోని షిర్డీ సాయిబాబా ఆలయంలో బాబా జన్మదినోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించనున్నారు. ఉదయం కాకడ హారతితో బాబా సేవలు మొదలవుతాయని నిర్వాహకులు తెలిపారు. సాయినాథుని మూల విరాట్‌కు పంచామృత, ఫల చందన సుగంధాలతో అభిషేకాలు చేస్తారు. అనంతరం ఉత్సవ మూర్తులకు భక్తులు స్వయంగా క్షీరాభిషేకాలు చేసే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. 9 గంటల నుంచి విశేష తులసిదళార్చన జరుగుతుందని పేర్కొన్నారు.

ఐఎన్‌టీఎస్‌వో పరీక్షల్లో 110 మంది ఉత్తీర్ణత

గాజువాక : ఇటీవల నిర్వహించిన ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలంపియాడ్ (ఐఎన్‌టీఎస్‌వో) లెవల్–2 పరీక్షల్లో శ్రీచైతన్య టెక్నో స్కూల్ పాతగాజువాక బ్రాంచ్‌కు చెందిన 110 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. వారిలో ఏడుగురు విద్యార్థులకు ఒకటి నుంచి ఐదు స్థానాలు, ఆరుగురు విద్యార్థులకు స్వర్ణ పతకాలతో కూడిన ప్రత్యేక బహుమతులు, 16 మంది కన్సొలేషన్ బహుమతులు, 53 మందికి మెరిట్ సర్టిఫికెట్‌లు లభించినట్టు పాఠశాల ప్రిన్సిపాల్ అరుణ కుమారి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు.

ప్రసాద్ స్కీమ్ పనులు వేగవంతం చేయండి




స్వరూపానందేంద్ర సరస్వతికి ప్రసాద్ స్కీం డీపీఆర్ అందజేస్తున్న ట్రస్ట్‌బోర్డు సభ్యుడు దినేష్‌రాజ్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో రూ.54.04 కోట్లతో ప్రసాద్ స్కీమ్ అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తిచేయాలని శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి సూచించారు. ప్రసాద్ స్కీమ్ పనులకు సంబంధించి ఇటీవల ఫైనల్ డీపీఆర్ సిద్ధం చేసిన విషయం తెలిసిందే. పనుల ప్రణాళికను బుధవారం సింహాచలం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు వారణాసి దినేష్‌రాజ్ స్వామీజీకి అందజేశారు. త్వరితగతిన టెండర్లు పిలిచి ఏడాదిలోపు పనులు పూర్తిచేసి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని స్వామీజీ ఈ సందర్భంగా సూచించారు. ఈ పనులు పూర్తయితే దేవస్థానంలో భక్తులకు మరిన్ని సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని స్వామీజీ సంతృప్తి వ్యక్తం చేశారు.

శ్రీరామనవమి వేడుకలు ప్రారంభం



హోమంలో పాల్గొన్న భక్తులు



ముస్తాబైన గోపాలపట్నం ప్రధాన రహదారిలోని రామాలయం



యల్లపువానిపాలెంలో సారె ఊరేగిస్తున్న గ్రామస్తులు

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు గొల్లకంచరపాలెం ధనలక్ష్మీ దేవి, సంపత్ వేంకటేశ్వరస్వామి, సీతారామాలక్ష్మణ ఆంజనేయ స్వామి ఆలయంలో శ్రీరామ నవమి వేడుకలు బుధవారం ఘనంగా ప్రారంభించారు. ఆలయ ప్రధాన అర్చకుడు రాజేటి రామాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ, నమ్మి రాజారమేష్ దంపతులు కలశ ప్రతిష్ఠ పూజలు చేశారు. అనంతరం యాగశాలలో హోమం నిర్వహించారు. గురువారం నిర్వహించే శ్రీరామనవమి వేడుకలకు ఆలయాన్ని సిద్ధం చేసినట్లు గ్రామ ఉపాధ్యక్షుడు యలమంచలి వెంకటరావు, పాత్రపిల్లి వెంకటరావు తెలిపారు. సామూహిక కల్యాణ వేడుకలకు భక్తులు ఉదయం 8 గంటలకు చేరుకోవాలని కోరారు. మధ్యాహ్నం 12 గంటలకు అన్నదానం ప్రారంభమవుతుందన్నారు.

శ్రీరామ నవమికి ఆలయాలు ముస్తాబు

గోపాలపట్నం: గోపాలపట్నం, ఎన్ఏడీ ప్రాంతాల్లో శ్రీరామనవమికి రామాలయాలు ముస్తాబవుతున్నాయి. గోపాలపట్నం ప్రధాన రహదారిలో రామాలయం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సీతారాము కల్యాణం, అన్నదానం నిర్వహించనున్నారు. బుచ్చిరాజుపాలెం గవర వీధి రామాలయంలో గురువారం సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించనున్నారు. విమాన్‌నగర్ ప్రధాన రహదారిలో సీతారాముల కల్యాణం నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

యల్లపువానిపాలెంలో సారె ఊరేగింపు

జీవీఎంసీ 89వ వార్డు యల్లపువానిపాలెంలో శ్రీరామనవమి సందర్భంగా భారీ సారె ఊరేగింపు నిర్వహించారు. గ్రామస్తులంతా స్వయంగా పిండి వంటలు చేసి సీతమ్మకు సారె అందించారు. గ్రామంలో పలు వీధుల్లో మేళ తాళాలతో ఊరేగించారు. గురువారం ఆలయ ప్రాంగణంలో శాస్త్రోక్తంగా సీతారాముల కల్యాణం నిర్వహించనున్నామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

విస్తృత ఏర్పాట్లు

సింధియా: జీవీఎంసీ 40వ వార్డు షిప్‌యార్డ్‌కాలనీలోని పురాతన శ్రీ ఉమారామలింగేశ్వరాలయంలో శ్రీరామనవమిని వైభవంగా నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేశారు. సీతారాములు కల్యాణోత్సవం అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించనున్నారు. షిప్‌యార్డ్ పరిశ్రమ కార్మికులందరికీ ప్రసాద వితరణ చేసేందుకు భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. ఫ్యాబ్రికేషన్, ఎరెక్షన్, వెల్డింగ్, హాల్ షాప్ తదితర విభాగాలకు ఆయా విభాగాల కార్మికులు ప్రసాదాలను తరలించనున్నారు.

క్షయవ్యాధిపై అవగాహన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న వైద్యులు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు

గోపాలపట్నం: క్షయ వ్యాధిని నిర్మూలనకు అందరి సహకారం కావాలని బుచ్చిరాజుపాలెం పట్టణ హెల్త్ సెంటర్ వైద్యురాలు డాక్టర్ దీపిక పిలుపునిచ్చారు. ఈ మేరకు బుచ్చిరాజుపాలెంలో క్షయవ్యాధిపై బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దగ్గు, జ్వరం ప్రారంభమై రెండు వారాలు కంటె ఎక్కువగా ఉన్నా.. ఆకలి లేకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తే వైద్యులను సంప్రదించాలని సూచించారు. వైద్యుల సూచనల మేరకు క్రమం తప్పకుండా మందులు వాడాలన్నారు. అవగాహనతోనే ఈ వ్యాధిని నిర్మూలించగలమని తెలిపారు. ఈ సందర్భంగా కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు వికాస్, టీబీ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఫెర్రో అల్లాయిస్ పరిశ్రమలను ఆదుకోవాలి



మాట్లాడుతున్న ఫెర్రో అల్లాయిస్ ఉత్పత్తి దారుల అసోసియేషన్ అధ్యక్షుడు షరఫ్

డాబాగార్డెన్స్: ఫెర్రో అల్లాయిస్ పరిశ్రమలను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఫెర్రో అల్లాయ్ ఉత్పత్తిదారుల అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్‌కే షరఫ్ కోరారు. నగరంలోని ఓ హోటల్లో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచ దేశాల్లోని ఫెర్రో అల్లాయ్ పరిశ్రమలకు విద్యుత్ యూనిట్ రూ.3 కంటే తక్కువకే లభిస్తుందన్నారు. మన దేశంలో కూడా పలు రాష్ట్రాల్లో విద్యుత్ చౌక ధరకే లభిస్తున్నందున అక్కడి ఫెర్లో అల్లాయి పరిశ్రమలు వాటి మనుగడను నిలబెట్టుకుంటున్నాయని చెప్పారు. ఫెర్రో ఉత్పత్తుల తయారీ పరిశ్రమలకు అత్యంత అవసరమైన ముడి పదార్థం విద్యుత్ సరఫరా అని, ఉత్పత్తి ఖర్చులో ఆయా ఫెర్రో అల్లాయ్ స్వభావాన్ని బట్టి 35 నుంచి 70 శాతం ఖర్చు విద్యుత్ కొనుగోలుకు వెచ్చిస్తున్నట్టు చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఫెర్రో అల్లాయ్ పరిశ్రమలను ప్రత్యేక తరగతికి చెందిన పరిశ్రమగా గుర్తించి ఎన్‌టీపీసీ నుంచి విద్యుత్ సరఫరా కేటాయింపులు చేయాలన్నారు. రాష్ట్రంలో 39 ఫెర్రో అల్లాయి పరిశ్రమలుండగా.. 33 యూనిట్లు 700 ఎంవీఏ పైగానే కాంట్రాక్టెడ్ ఎండీతో నడుస్తూ 40 వేల మంది కార్మిక కుటుంబాలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా జీవనోపాధి కల్పిస్తున్నాయని చెప్పారు. ఈ సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధి శర్మ, తదితరులు పాల్గొన్నారు.

'ఉక్కు బాధ్యతల విస్మరణ దుర్మార్గం'

- కార్పొరేటర్ గంగారావు
- ఈవోఐకు వ్యతిరేకంగా స్టీల్ సీఐటీయూ మిత్రపక్షాల ధర్నా



ధర్నాలో ప్రసంగిస్తున్న కార్పొరేటర్ గంగారావు

ఉక్కునగరం: ప్రజా సంపద అయిన స్టీల్‌ప్లాంట్‌పై ప్రభుత్వం తన బాధ్యతను విస్మరించడం దుర్మార్గమని 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, సీఐటీయు ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి అన్నారు. ఇటీవల ఉక్కు యాజమాన్యం ముడిసరకు కోసం ఆసక్తి వ్యక్తీకరణ (ఈవోఐ) ప్రకటన చేయడానికి నిరసనగా స్టీల్ సీఐటీయూ మిత్రపక్షాల ఆధ్వర్యంలో బుధవారం ఉక్కు పరిపాలన భవనం కూడలి వద్ద ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలంటూ యాజమాన్యం స్థానిక కార్మిక సంఘాలతో చర్చించకుండా ప్లాంట్ భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేసేలా నిర్ణయాలు తీసుకోవడం అన్యాయమన్నారు. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ అన్ని కార్మిక సంఘాలు కేంద్ర ఉక్కుశాఖా మంత్రికి విజ్ఞప్తి చేసిన విషయాన్ని గుర్తు చేశారు. యాజమాన్యం వెంటనే ఆ ప్రతిపాదనను విరమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వై.టి. దాస్, మిత్రపక్షాల నాయకులు డి.వి. రమణారెడ్డి, డి. సురేష్‌బాబు, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.